క్లుప్తంగా

కూలర్ల కొనుగోళ్లపై విచారణ చేపట్టాలి



వినతి పత్రం ఇస్తున్న యువకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కూలర్లు ఏర్పాటు చేసేందుకు చేసిన కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని వెంటనే విచారణచేపట్టాలని మంగళవారం ఆలయ ఏఈఓ బుద్ది శ్రీనివాస్‌కు మండల కేంద్రానికి చెందిన యువకులు ఉప్పల వంశీకృష్ణ, సనాది కరుణాకర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వేసవిలో ఆలయ అవసరాల నిమిత్తం గోద్రెజ్ కంపెనీకి చెందిన ఐదు కూలర్లను చేర్యాలలోని ఓషాప్‌లో కొనుగోలు చేశారన్నారు. ఒక కూలర్ ధర రూ 9,800 ఉంటే రూ 12,800 చెల్లించారని ఆరోపించారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని శనిగరంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీపీఎస్ రద్దుకు ఉద్యోగులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయి పెండింగ్‌లో ఉందని, వాటిని వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

గోరింటాకుతో ఆరోగ్య ప్రయోజనాలు

సీడీపీఓ రమాదేవి

చిన్నకోడూరు(సిద్దిపేట): గోరింటాకు పెట్టుకుంటే వర్షాకాలంలో మహిళలకు తలెత్తే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సీడీపీఓ రమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో అంగన్‌వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలంలో మహిళలకు వచ్చే చర్మ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలను గోరింటాకు దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామ కంఠం కబ్జాపై విచారణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామ కంఠంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ స్థలకబ్జాపై మంగళవారం ఆర్ఐ ప్రవీణ్, సర్వేయర్ హరీష్ విచారణ చేపట్టారు. స్థలం రికార్డును పరిశీలించారు. కబ్జా చేసిన వ్యక్తి భూపత్రాలు లేకపోవడంతో మండి పడ్డారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తెలంగాణ టీమ్ కెప్టెన్‌గా చైతన్యశ్రీ

చిన్నకోడూరు(సిద్దిపేట): అండర్-17 జూనియర్ నేషనల్ ఫుట్‌బాల్ తెలంగాణ టీమ్‌కు కెప్టెన్‌గా చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని వడ్లకొండ చైతన్యశ్రీ ఎంపికైనట్లు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో తెలంగాణ టీమ్‌కు కెప్టెన్‌గా చైతన్యశ్రీ నియమితురాలవడంపై మంగళవారం ప్రిన్సిపాల్ భూపాల్ రాజు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి ఘనంగా సత్కరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

చలో ఢిల్లీ కరపత్రిక ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్: జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. మాల, మహార్ అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 7, 8, 9వ తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామాజిక చైతన్య దీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): ఆగస్టు 7, 8, 9 తేదీల్లో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షలను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్షల కరపత్రాలను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక మండలం దుద్దెడ గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా రాజంపల్లికి చెందిన సుమన్ (30), లక్ష్మణ్(24), క్రాంతి (25) బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నారు. ఈక్రమంలో రాజీవ్ రహదారిపై ఉన్న మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో వారు కిందపడి తీవ్రంగా గాయపడ్దారు. 108 అంబులెన్సు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిదిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీశ్



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేటరూరల్: ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మ సతీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేపట్టి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. గొల్ల కురుమలకు వంద రోజుల్లో రెండో దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రూ.2 లక్షలు లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నాయకులు బైరి శంకర్, కోడూరి నరేష్, దొంతుల సురేష్ , బాసంగారి వెంకట్, యాదన్‌రావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

మున్సిపల్ ఛైర్ పర్సన్ రజిత



హుస్నాబాద్‌లో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

హుస్నాబాద్: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ రజిత అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో మంగళవారం సఫాయి అప్నా బీమారి భగావో కార్యక్రమం నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో పాత కుండలు, టైర్లలో నిల్వ నీటిని తొలగించాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొల్లి కల్పన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బెజ్జంకి(సిద్దిపేట): వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెజ్జంకి తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుగ్గిల్ల గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. వనమహోత్సవంలో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, కార్యదర్శి వంశీ, కారోబార్ అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం



డ్రైనేజీని శుభ్రం చేస్తున్న మహిళలు

మర్కూక్(గజ్వేల్): ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు సమస్యలకు నిలయంగా మారాయి. మండలంలోని గంగాపూర్- యూసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామంలో భూగర్భ డ్రైనేజీ పూడుకుపోవడంతో మురుగు పారుదల నిలిచిపోయింది. దీంతో దుర్గంధ వెదజల్లుతోంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల బెడదతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. దోమకాటుతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కార్యదర్శికి, సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియయడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే టీఎన్జీఓ లక్ష్యం

టీఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, విక్రంరెడ్డి



జానకిరాములును సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, విక్రంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని బాలుర హబ్‌లోగల హాస్టల్ వార్డెన్ జానకిరాములు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు తీసుకెళ్తున్న ఉద్యోగులు అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని, కష్టపడి పనిచేసే వారి కోసం టీఎన్జీఓ అండగా ఉంటుందన్నారు. అనంతరం జానకిరాములును సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు సురేందర్‌రెడ్డి, అశ్ఫక్, అహ్మద్, సత్యనారాయణ, లింగం, రాజశేఖర్‌రెడ్డి, కమలాకర్, అనిత, నరేష్‌చారి, జయరాములు, శ్వేత, లక్ష్మీ, స్వప్న, జెబినా సుల్తానా, నాగభూషణం, శ్వేత, శ్రీనివాస్, శివప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల నిరసన



నినాదాలు చేస్తున్న పెన్షనర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద చేపట్టిన మౌనదీక్షలో పాల్గొనేందుకు సిద్దిపేట పెన్షనర్లు తరలి వెళ్లినట్లు, జిల్లా పెన్షనర్ల జేఏసీ నేతలు తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపామన్నారు.

కేంద్ర విధానాలపై ఉద్యమించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: ప్రజావ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాల ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు చుక్క రాములు అన్నారు. మంగళవారం సిద్దిపేటలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలపై భారం వేస్తూ కార్పొరేట్లకు, సంపన్నులకు రాయితీలు ఇచ్చారని మండిపడ్డారు. సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా వేలం పాటలో పాల్గొనేలాచేసి ప్రైవేటు పరం చేసే విధానాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దీంతో విద్యుత్, రవాణా రంగాల్లో ప్రజలకు సబ్సిడీలు ఇచ్చే అవకాశం ఉండదన్నారు. అలాగే బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, విభజన హామీల అమలుకు ఎలాంటి కేటాయింపులు చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ సంఘం అధ్యక్షుడిగా అరుణ్

చిన్నకోడూరు(సిద్దిపేట): జాతీయ బీసీ సంక్షేమ సంఘం చిన్నకోడూరు మండల కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు నవీన్ గౌడ్ నియమించారు. అధ్యక్షుడిగా నిమ్మల అరుణ, ప్రధాన కార్యదర్శిగా ముత్తి మహేష్, కార్యదర్శిగా రేపాక స్వామి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ కామారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లికి చెందిన కర్నాల నవీన్, కోల సందీప్ పేరిట మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ అందజేశారు. ఇద్దరు యువకులు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని గత బీఆర్‌ఎస్ పాలనలో ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన నవీన్ పేరిట రూ.56,500, సందీప్ పేరిట రూ. 22,500 ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఎన్నికల కోడ్ అమలుతో చెక్కుల పంపిణీ నిలిచిపోయింది.

గుబ్బడి గుట్ట కబ్జాపై ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 23వ తేదీన 'గుబ్బడి గుట్టను మింగేశారు' దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా అప్పట్లో రెవెన్యూ అధికారులు మోకా విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. అయితే, తూతూ మంత్రంగా విచారణ జరిపి వదిలేశారని ఆరోపిస్తూ మంగళవారం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కబ్జా చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకోకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అక్రమ అరెస్టులు సరికాదు

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ



పోలీసుల అదుపులో ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు

దుబ్బాక టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ధర్నా చేయడానికి చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరుతున్న ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రజలకు అనేక సేవలందిస్తున్నారన్నారు. అయినా, ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వడంలేదన్నారు.

హైదరాబాద్ తరలిన కార్మికులు

కొండపాక(గజ్వేల్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి కొండపాక, కుకునూరుపల్లి మండలాల నుంచి పంచాయతీ కార్మికులు మంగళవారం తరలివెళ్లారు.

వర్షాకాలంలో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి

ఎంవీఐ కొండల్ రావు

హుస్నాబాద్: వర్షా కాలంలో డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలను నడపాలని ఎంవీఐ కొండల్ రావు డ్రైవర్లకు సూచించారు. ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రమాద రహిత ముగింపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను సన్మానించారు. జూన్, జూలైకు సంబంధించి డిపోకు ఆదాయం తెచ్చిన డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు ప్రదానం చేశారు. అలాగే రూ.లక్షే లక్ష్యంలో భాగంగా డిపోలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణమాఫీపై సీఎం వీడియో కాన్ఫరెన్స్



తిగుల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రెండో విడత రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం మండలంలోని తిగుల్ రైతు వేదికలో నిర్వహించారు. రైతులు తరలి వచ్చి కాన్ఫరెన్స్‌ను వీక్షించారు.

రుణమాఫీ అమలు

సిద్దిపేట రూరల్: ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తుందని రూరల్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని క్లస్టర్ రైతువేదికల్లో రెండో విడత రైతు రుణ మాఫీపై సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడారు.

బడ్జెట్‌లో ఆటోడ్రైవర్లకు మొండి చెయ్యి



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్ బాబు

హుస్నాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా మొండి చెయ్యి చూపిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న ఆర్థిక సహాయం ప్రస్తావనే లేకపోవడం విచారకరమన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాది రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించాడు. మహాలక్ష్మి పథకం అమలుతో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశాడు. సమావేశంలో బీజేపీ నాయకులు రాంప్రసాద్, నరేష్, రాజేందర్, వెంకటేష్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మొక్కలను సంరక్షించాలి**

దుబ్బాకటౌన్: నాటిన ప్రతీ మొక్కను ప్రజలు సంరక్షించాలని కౌన్సిలర్ ఆస యాదగిరి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా దుబ్బాక 14వ వార్డులో మంగళవారం మహిళలకు పూల మొక్కలను పంపిణీ చేశారు.

కాసులాబాద్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): వనమహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ గంగుల గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాసులాబాద్‌లో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. లక్ష్మీనగర్‌లో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు.

◆ **ఘనంగా శీత్లా ఉత్సవం**

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనులు ఏటా నిర్వహించే శీత్లా ఉత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గిరిజనులు గ్రామ సమీపంలో కొలువైన అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేసుకుంటూ ఆలయానికి వెళ్లారు.

◆ **పౌరహక్కులపై అవగాహన అవసరం**

అక్కన్నపేట(హుస్నాబాద్): రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రజలకు అవగాహన ఉండాలని ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో మంగళవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులకు భంగం కలిగితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

కోహెడరూరల్(హుస్నాబాద్): తమ సమస్యలు పరిష్కరించాలని మోడల్ స్కూల్ పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులు కోరారు. మంగళవారం మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్ ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీలు, కారుణ్య నియామకాలు, హెల్త్‌కార్డులు, వేతనాలు సకాలంలో ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

◆ **అక్రమ నిర్మాణాలు తొలగించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామంలోగల సర్వే నంబర్ 321లోని అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుజాత, ఎంపీడీఓ ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో స్వాధీనం చేసుకున్న భూమిలో తిరిగి నిర్మాణాలు చేపడుతున్న వారితో పాటు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు.

◆ **కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్‌చైర్మన్‌గా శంకర్**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన చింతకింది శంకర్ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. మంగళవారం జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు దళితుల అభ్యున్నతికి తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో దాస అంజయ్య, మార్క సతీశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ**

సిద్దిపేటకమాన్: ఆగస్టు 25వ తేదీన కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సిద్దిపేటలో నిర్వహిస్తున్నట్లు కృష్ణస్వామి సమితి రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ మంగళవారం తెలిపారు. ఈమేరకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో విగ్రహావిష్కరణ కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

◆ **రెండో విడత రుణమాఫీపై సంబరాలు**

గజ్వేల్: రెండో విడత రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం గజ్వేల్‌లో కాంగ్రెస్ నేతలు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని రైతువేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోస్, మొనగారి రాజు, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేశ్‌గౌడ్, నంగునూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ **పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

సిద్దిపేటఅర్బన్: మండల పరిధిలోని మిట్టపల్లి ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించి, ఆటపాటలతో సందడి చేశారు.

◆ **మహిళల రక్షణ చట్టాలపై అవగాహన**

హుస్నాబాద్: మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కలిగిన ఉండాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమని, క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

◆ **సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరాములు తెలిపారు. మిరుదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం రామలింగం, టీచర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఎం చిత్రపటం బహూకరణ**

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన మోహన్‌కు గ్రామ కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్ గౌడ్, నవీన్ పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే రైతుల సంక్షేమం**

కోహెడరూరల్(హుస్నాబాద్): రైతుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2 లక్షల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటల గారడీతో ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు.

◆ **జయప్రదం చేయండి**

చేర్యాల(సిద్దిపేట): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఆగస్టు 6వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాదీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ అధ్యక్షుడు చుంచు నర్సింగరావు ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు.